www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024
5

వైఎస్ఆర్

ఎమ్మెల్సీగా రామచంద్రయ్య ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రమాణ స్వీకారం చేస్తున్న రామచంద్రయ్య

వెలగపూడిలోని కౌన్సిల్ ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రామచంద్రయ్యతో శాసన పరిషత్తు ఛైర్మన్ మోషేను రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవల ఈయన ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం రామచంద్రయ్యకు అభినందనలు తెలుపుతూ శాసన పరిషత్ నియమ నిబంధనల పుస్తకాలను ఎమ్మెల్సీకి ఛైర్మన్ అందజేశారు.

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో

భారీ అగ్నిప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంటల్లో కాలిపోయిన విలువైన భూములకు సంబంధించిన రెవెన్యూ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు

మంటల్లో దగ్ధమైన ఫర్నిచర్లు, ఫ్యాన్లు

- కీలక రికార్డులు దగ్ధం
- ఘటనపై ప్రభుత్వం సీరియస్, విచారణకు ఆదేశం
- ఫైళ్లు దగ్ధంపై తీవ్రంగా స్పందించిన సిఎం చంద్రబాబు
- పోలీసుల అదుపులో జూనియర్ అసిస్టెంట్
- ఆర్‌డిఒ, తహశీల్దార్, ఉద్యోగుల ఫోన్లు సీజ్
- మదనపల్లెకు చేరుకున్న డిజిపి, సిఐడి చీఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో ఉద్దేశపూర్వకంగానే భూముల దస్త్రాలు తగుల బెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్ల క్రితం నూతనంగా నిర్మించిన భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంపై పలు అనుమానాలు, విమర్శలు వెళువెత్తుతున్నాయి. సెక్షన్ 22ఎ విభాగం, కంప్యూటర్ సెక్షన్‌లో పూర్తిగా ఫైళ్లు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో రాత్రి విధుల్లో నైట్ వాచ్‌మెన్‌గా ఉన్న నిమ్మనపల్లె మండలం అగ్రహారంకు చెందిన విఆర్ఎ రమణ మంటలను గమనించి నిమ్మనపల్లె డిప్యూటీ తహశీల్దార్ తపస్వినికి సమాచారం అందించాడు. ఆ వెను వెంటనే ఆమె మదనపల్లె ఆర్‌డిఒ సిసి మణికి సమాచారం ఇచ్చారు. ఆయన ఫైర్ సిబ్బందికి సమాచారం అం దించాడు. అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బందితో సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఎగిసి పడుతున్న మంటలను అదుపు చేశారు. అప్పటికే భవనంలోని పలు రికార్డులు, డాక్యుమెంట్లు, కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద విషయాన్ని కలెక్టర్, ఎస్‌పిల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి రాజ్‌కుమార్ ఆఘమేగాల మీద మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే చేరుకున్న క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, సిఐడి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విచారణ మొదలు పెట్టాయి. కార్యాలయంలోని సిసి కెమెరా ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అయినప్పటికి రాత్రి 10.30 గంటల వరకు విధుల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ (కంప్యూటర్ ఆపరేటర్) గౌతమ్ తేజను పోలీసులు అదుపులోకి తీసుకుని ఏమి జరిగిందనే దానిపై విచారణ చేపట్టారు. జిల్లా స్థాయి ఇన్వెస్టిగేషన్ అధి కారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుండగానే ప్రత్యేక హెలికాప్టర్‌లో డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సాయంత్రానికి మదనపల్లెకు చేరుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని లోతైన, సమగ్ర విచారణ చేపట్టారు. మదనపల్లె ఆర్‌డిఒ, తహశీల్దార్, ఉద్యోగుల ఫోన్లను అధికారులు సీజ్ చేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గుమిగూడిన ప్రజలు

సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఘన చరిత్ర

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఘన చరిత్ర ఉంది. బ్రిటీష్ వారి పరిపాలనా కాలం నాటినుండే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాల యం ఆసియా దేశాలలోనే అతి పెద్ద రెవె న్యూ డివిజన్‌గా పేరు గడించింది. డివి జన్ పరిధిలో 31 మండలాలు ఉండేవి. అన్ని మండలాలకు చెందిన రెవెన్యూ భూముల రికార్డులు ఇక్కడే ఉండేవి. సబ్ కలెక్టర్ స్థాయిలో ఐఎఎస్ అధికారులే ఇక్కడ పాలనా బాధ్యతలు చేపట్టేవారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంతవరకు ఒక చిన్న సంఘటన కూడా జరగకపోవడం గమనార్హం. అలాంటిది ఐదేళ్ళ పాలనలో ఇక్కడ ఐఎఎస్ అధికారులు కాకుండా కేవలం తహశీల్దారు నుండి ఆర్‌డిఒలుగా ఉద్యోగోన్నతి పొందినవారు విధులు నిర్వర్తించారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో జిల్లాల పునర్విభజన జరగడంతో మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలే మిగిలాయి. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గ మండ లాలతో పాటు పీలేరు నియోజక వర్గంలోని వాల్మీకిపురం, కలికిరి మండలాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి వచ్చాయి. కాగా ఎన్‌డిఎ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడున్న ఆర్‌డిఒను బదిలీ చేసి ఐఎఎస్ అధికారి మేఘ స్వరూప్‌కు మదనపల్లె సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుతం ఉత్తర్వులు జారీ చేసింది. మేఘ స్వరూప్ సోమవారం బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్ని ప్రమాదానికి గురికావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసుల అదుపులో జూనియర్ అసిస్టెంట్ గౌతమ్

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ 25 కీలక ఫైళ్లు కాలిపోయాయని చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో 22 (ఎ) వంటి పలు సబ్జెక్టులు చూసే విభాగంలో ఈ అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంపై అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి రాజ్‌కమల్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, రాజంపేట ఆర్‌డిఒ మోహన్ రావు పాల్గొన్నారు.

మదనపల్లె ఘటన యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్

- డిజిపి ద్వారకా తిరుమలరావు

సంఘటనకు సంబంధించి మీడియాతో మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఘటన యాక్సిడెంట్ కాదని, ఇన్సిడెంట్‌గా అనిపిస్తోందని డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయన సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆదివారం అర్థ రాత్రి సుమారు 11.30 గంటలకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి ందన్నారు. మూడు గంటల పాటు పరిశీలించిన తర్వాత అది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్‌గా భావిస్తున్నామన్నారు. 22 ఎ భూముల రికార్డులున్న గదిలో ఫైర్ ఇన్సిడెంట్ జరిగిందని చెప్పారు. కీలక దస్త్రాలున్న విభాగంలో ఈ ఘటన చోటు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఘటన సమాచారం ఆర్‌డిఒకు తెలిసి ందని, కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. ఘటన విషయం తెలుసుకున్న సిఐ కూడా ఎస్‌పి, డిఎస్‌పిలకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొ న్నారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల అలసత్వం కనిపి స్తోందని తెలిపారు. కార్యాల యంలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశమే లేదని విచారణలో తేలిందన్నారు. ఇక్కడ వోల్టేజ్ తేడాలు లేవని అధికారులు చెబుతున్నారని, ఇదే విషయాన్ని ఫోరెన్సిక్ వాళ్లు కూడా చెప్పారని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం కిటికీ బయట అగ్గిపుల్లలు కనిపించాయని తెలిపారు. కార్యాలయం బయట కూడా కొన్ని ఫైళ్లు కాలిపోయాయన్నారు. ఇవన్నీ అనుమానాలను మరింత పెంచు తున్నాయని చెప్పారు. ఇటీవల సాక్ష్యాలను నాశనం చేసే ఘటనలు కొన్ని జరిగాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ దిశగానూ దర్యాప్తు ప్రారంభించామని, కేసు దర్యాప్తునకు 10 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కేసు సిఐడికి బదిలీ చేసే అంశంపై మంగళవారం లేదా బుధవారం నిర్ణయం తీసుకుంటామన్నారు. యాక్సిడెంట్ కాదు.. కుట్రో కాదో విచారణలో తేలుస్తాఃమని తెలిపారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్న ఆయన పోలీసు శాఖ కూడా దీనిని తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసు జాగిలాన్ని కార్యాలయంలోకి తీసుకెళ్తున్న డాగ్‌స్క్వాడ్

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో 'నాంది'

ప్రజాశక్తి - కడప సిటీ : స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం 'నాంది-2024'ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీర సుదర్శన రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేయడానికి తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల చైర్మన్ గంగి రెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం తరపున అభినందనలు తెలిపారు. 'అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి కనీసం ఒక ఉద్యోగమైనా ఇవ్వాలన్న కళాశాల లక్ష్యాన్ని తెలియజేశారు. మెకానికల్ వాతావరణానికి భిన్నంగా తమ కళాశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలియజేశారు. తమ కళాశాలలో నిర్వహించే వర్క్ షాప్, సెమినార్, టెక్ ఫెస్ట్, ట్రెడిషనల్ డే వంటి కో- కరిక్యులర్ కార్యక్రమాలలో ప్రతి విద్యార్థి పాల్గొని బహుముఖ నైపుణ్యాలను అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంలో ముందుంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి వెళ్లి తమ తల్లిదండ్రులకు, దేశానికి సేవచేసే భావిభారత పౌరులను తీర్చి దిద్దడంలో తాము కృషి చేస్తామని అన్నారు. అనంతరం 2023-2024 లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు.

ఆశలపద్దు..!

- కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై ఆశలు
- ఉక్కు పరిశ్రమకు ఊతమిచ్చేనా?
- వెనుకబడిన ప్రాంతాల నిధులపై నిరీక్షణ
- నేడు కేంద్రబడ్జెట్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్-2024-25 సమర్పణకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. జిల్లాలోని విమాన, రైల్వే, ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్ వంటి సమస్యలకు నిధుల కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పెండింగ్ రైల్వేలైన్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, మధ్య తరగతి నుంచి 4.6 కోట్ల మంది నుంచి 16 కోట్ల మంది దారిద్ర్యంలోకి జారుకున్న నేపథ్యంలో పేదల అభ్యున్నతి, నిత్యావసరాల ధరల తగ్గింపు వంటి సమస్యలు పేదలను చుట్టుముట్టడం తెలిసిందే. ఇటువంటి సామాన్యులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత లభించనుందా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది. తాజా బడ్జెట్ ప్రత్యేకతను సంతరించుకుంది.

ప్రధానంగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, సుమారు రూ.1050 కోట్ల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్, కడప నుంచి విజయవాడకు రైల్వేలైన్, కడప-బెంగళూరు రైల్వేలైన్లకు కేటాయింపులపై ఆసక్తి నెలకొంది. వీటిపై పదేళ్లుగా ప్రజానీకానికి ఎదురుచూపులు తప్పడం లేదు. గత పది బడ్జెట్ల ఆర్థిక సర్వే, ఎటిఆర్ నివేదికల్లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే లేకపోవడంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. తాజా బడ్జెట్‌లోనైనా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, మైన్స్ కేటాయింపు, రాత్రిపూట విమానాల ల్యాండింగ్, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు, కడప రైల్వేస్టేషన్ ఆధు నికీకరణ కేటాయింపులు చేయాల్సి ఉంది. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పును కోరుతూ గత ప్రభుత్వం లేఖ రాసిన నేపథ్యంలో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది. సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్‌ను కలిపేయడంతో రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కుతుందనే ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

కడప-బెంగళూరు, ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి- వాయల్పాడు పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. కడప-బెంగళూరు ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా చిత్తూరు జిల్లా వరకు చేపట్టాల్సిన పనులు నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్ ప్రారం భించినప్పటికీ, సరుకు సరఫరాకు మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రొద్దుటూరు-కంభం, భాకరా పేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు రైల్వేలైన్ ప్రతి పాదనల దశ దాటకపోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. కడప- బెంగళూరు, కడప-విజయవాడ లైన్ కేటాయింపు ఆశలపైనే అందరిదృష్టి నిలిచింది. నందలూరు రైల్వే లోకోషెడ్‌కు ప్రత్యా మ్నాయం, షిర్డీకి రైలు, తిరుపతి-మచిలీపట్నం రైలు కడప మీదుగా వెళ్లే అవకాశం కల్పించాలనే డిమాండ్లపై ఆసక్తి నెలకొంది. కడప-విజయవాడ, కడప-బెంగళూరు రైలు మార్గా లకు నిధుల కేటాయింపులు చేయాలని ప్రజానీకం ఎదురు చూస్తోంది. ఉపాధి హామీ నిధుల పెంపు, వేతన శ్లాబుల పెంపు, మహిళా సంక్షేమం వెరసి సామాన్యుల జీవన ప్రమాణాల, వ్యవసాయ కేటాయింపుల పెంపు వంటి సామాజిక పురోగమిత అంశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ముగ్గురు రెవెన్యూ అధికారులు సస్పెన్షన్

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు చర్యలు
- కలెక్టర్ శివ శంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు రెవెన్యూ అధికారులను కలెక్టర్ శివ శంకర్ లోతేటి సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బద్వేల్ డివిజన్ బి.కోడూరు మండలం మున్నెల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ లో 4.27 ఎకరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు (1985) చెందిన స్థలాన్ని డిప్యూటీ తహశీల్దార్ జి.విద్యాసాగర్, గ్రామ సర్వేయర్ ఏ.ప్రవీణ్ కుమార్, విఆర్‌ఒ జె.గురవయ్య కలిసి రికార్డులను పరిశీలించకుండా, ప్రాథమిక విచారణ చేయకుండా దురుద్దేశంతో నిబంధనలకు వ్యతిరేకంగా కొండా వెంకటసుబ్బమ్మ పేరుపై బదిలీ చేశారు. దీంతో ఆమె ఈ ఏడాది ఫిబ్రవరి 14న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్)లో మార్టిగేజ్ చేసి సుమారు రూ.8 లక్షల రుణం కూడా తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై బద్వేల్ ఇన్‌ఛార్జి ఆర్డీవో చంద్రమోహన్ విచారించి నివేదికను కలెక్టర్‌కు సమర్పించడంతో ఆయన ముగ్గురు రెవెన్యూ అధికారులను తక్షణమే సస్పెండ్ చేశారు. ఇక మీదట ఏ అధికారి అయినా చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడిన, నిబంధనలకు వ్యతిరేకంగా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డిఒ, తహశీల్దార్, అన్ని రెవెన్యూ కార్యాలయాలకు నైట్ వాచ్ మెన్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. 6 నెలలు వేతనాలు రాకపోవడం బాధాకరమని తెలిపారు. పిల్లలకు చేదోడు వాదోడుగా భద్రతగా ఉండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వేతనాలు పడకపోయినా ఎప్పుడో ఒకసారి వస్తాయని విధులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. అలాంటి సెక్యూరిటీకి తక్షణం ఫిబ్రవరి నుంచి రావాల్సిన వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రిమ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఆరోగ్యశ్రీ డబ్బులు ఇవ్వాలని కోరారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఉన్న సెక్యూరిటీ వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిసిఒను ఆదేశించారు. రిమ్స్ సూపరింటెండెంట్‌కు వెంటనే ఆరోగ్యశ్రీ డబ్బులు సిబ్బందికి ఇవ్వాలని పేర్కొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి.. మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన వ్యవ సాయ కార్మికులకు 8 వారాలు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యా లయంలో స్పందనలో డ్వామా ఇన్‌ఛార్జి పీడీ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ వేణు నాయక్‌కు ఉపాధి కూలీలకు పెండింగ్ ఉన్న బకాయిలు విడుదల చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా నిర్వహించడం లేదన్నారు. చేసిన పనులకు వారం వారం డబ్బులు చెల్లిస్తే కూలీల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కూలీల బకాయిలు సకాలంలో విడుదల చేయటం లేదన్నారు. వంద రోజులు పూర్తి చేసిన కూలీలకు తిరిగి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. 5 సంవత్సరాల నుంచి కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదని చెప్పారు. వెంటనే వంద రోజులు పనులు పూర్తి చేసిన వారందరికీ పనిముట్లు ఇవ్వాలని పేర్కొన్నారు.

బోధనాభ్యాసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

- టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు దండే పాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందించే శిక్షణల ద్వారా బోధనాభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు దండేపాల్ సూచించారు. సోమవారం నగరపాలక ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన అభ్యసన ప్రక్రియలో మార్పులను ఉపాధ్యాయులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. అందులో టీచ్ టూల్ ముఖ్యమైనదని గుర్తు చేశారు. 9 రోజులపాటు నిర్వహించే శిక్షణను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరగతి గదిలో విద్యార్థులకు వీటిని అమలు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన మేర విద్యార్థుల నుంచి ఫలితాలను పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణ ద్వారా అనేక మెలకువలను తెలుసుకుని ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.. అనంతరం కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో ఉపాధ్యాయులు శిక్షణ పొందిన తరువాత విద్యార్థుల మమేకమై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణాన్ని కాపాడొచ్చు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రక్తదానంతో ప్రాణదానం చేయడం సాధ్యమవుతుందని వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి అన్నారు. సోమవారం స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల్లో భాగంగా కడప పాత బస్టాండ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ఆరోగ్యవంతులు ముందుకు రావాలని కోరారు. రక్తం ఏ ప్రయోగశాలలో తయారవ్వనిదని, కేవలం ఒక మనిషి మాత్రమే దానం చేయగలరని తెలిపారు. వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిసా ఛారిటబుల్ వ్యవస్థాపకులు జూటూరు విజయ్ కుమార్, జెబీవీఎస్ వ్యవస్థాపకుడు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు అశోక్, రిమ్స్ సిబ్బంది, సిఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సునీల్ జయంత్, ప్రసాద్, ఈశ్వరయ్య, నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో గెలుపొందిన క్రీడాకారులు

పులివెందుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బెంగళూరులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ కర్నాటక నిర్వహించిన 2024 సౌత్‌జోన్ తైక్వాండో ఛాంపియన్ పోటీల్లో పులివెందుల యువ మార్షల్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించి తమ ప్రతిభను చాటారు. మినీ సబ్ జూనియర్ అండర్–25 కిలోల విభాగంలో నాలుగు గోల్డ్, మూడు సిల్వర్ మెడల్స్, సబ్ జూనియర్ అండర్–30కిలోల విభాగంలో మూడు గోల్డ్, ఐదు సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్, క్యాడెట్ అండర్–45 కిలోల విభాగంలో రెండు గోల్డ్ మూడు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ దాకాల గంగాధర్ తెలిపారు. సీనియర్ కేటగిరి విభాగంలో మూడు గోల్డ్ మూడు సిల్వర్ ఒక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ దాకాల గంగాధర్ తెలిపారు. ఇలా జోనల్‌స్థాయి కరాటే పోటీల్లో తమ పిల్లల పతకాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పులివెందుల పట్టణంలో యువ మార్షల్ ఆర్ట్ అకాడమీ స్థాపించి తమ పిల్లలకు శిక్షణ ఇస్తూ పిల్లల ప్రతిభను గుర్తిస్తూ జోనల్‌స్థాయిలో ఆడటానికి కృషి చేసిన కరాటే శిక్షకుడు గంగాధర్‌ను వారు అభినందించారు.

ప్రయివేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలోని ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్ సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు కోరారు. ఆ మేరకు సోమవారం డిప్యూటీ డిఇఒ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రయివేట్ టీచర్లు ఎలాంటి హక్కులు లేకుండా నిత్యం దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. జిఒఎమ్‌ఎస్–1 ప్రకారం ప్రయివేట్ పాఠశాలల నిర్వాహణ జరగడం లేదని, కానీ అందులో పనిచేసే టీచర్లకు చట్టపరంగా రావాల్సిన జీతభత్యాలు యాజమాన్యాలు ఇవ్వడంలేదన్నారు. దీని పట్ల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిటిఎల్‌యు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తమ భూమి సమస్యలు పరిష్కరించాలంటూ తహశీల్దార్ భీమేశ్వరరావుకు పలువురు రైతులు వినతిపత్రాలను అందజేశారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావులకొలను గ్రామానికి చెందిన రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. భూముల రీసర్వేలో తీవ్రంగా నష్టపోయామని, మళ్లీ సర్వే చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సల్మాన్ రాజ్, ఆర్‌ఐ షేక్షావలి పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు, రైతులు, విద్యార్థుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ సువర్ధన్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలపై తిమ్మాపురం, కొత్తపల్లె, బొందలకుంట, చింతకుంట గ్రామాల రైతుల నుంచి వినతులు వచ్చాయన్నారు. పులివెందుల రహదారి సమీపంలో ఉన్న ప్యాక్టరీ నుంచి విసర్జితాలు దుర్వాసన వస్తోందని, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ధర్నా చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని పెద్దదుద్యాల గ్రామస్తుడు సాంబశివారెడ్డి వినతిపత్రం అందజేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

మధుమేహం పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మధుమేహం పట్ల మందులతోపాటు అవగాహన అవసరమని ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక హోమస్‌పేటలోని డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి హాస్పిటల్‌లో సోమవారం ఆయన వంద మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బయట రూ.700 తీసుకునే పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆహార పదార్థాల మార్పుతోపాటు కనీసం అరగంట వ్యాయామం చేయడం దినచర్యలో తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

జెవివి ఆధ్వర్యంలో టెట్ ఉచిత తరగతులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాట్లాడుతున్న రవిప్రకాష్

టెట్ డిఎస్‌సి తెలుగు ఉచిత తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక (జెవివి)రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధానోపాధ్యాయుడు రవిప్రకాష్ కోరారు. జెవివి ఆధ్వర్యంలో సోమవారం నుంచి జెవివి కార్యాలయంలో తరగ తులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ లక్ష్యం వైపు దృష్టి పెట్టి ప్రణాళికాబద్ధంగా చదివితే విజేతలవుతారని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి, చంటి మాట్లాడుతూ సిలబస్‌ను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. జెవివి ప్రధాన కార్యదర్శి సునీత మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి క్లాసులకు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జెవివి ఉచిత తరగతులను నిర్వహించడాన్ని వక్తలు అభినందించారు.

అత్యాచారయత్నం, దాడి చేసినట్లు మహిళ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చెండ్లూరు గ్రామానికి చెందిన పట్నం దస్తగిరమ్మ తనపై బలవంతం, దాడి జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం.. సోమవారం పశువులను మేపుకునేందుకు తోలుకెళ్లడానికి పశువుల పాకలో ఉండగా.. అదే గ్రామానికి చెందిన బయపురెడ్డి శ్రీనివాసులురెడ్డి వెనుక వైపు నుంచి వచ్చి పిడి బాకు మెడపై ఉంచి గట్టిగా పట్టుకున్నాడని తెలిపింది. భయంతో కేకలు వేస్తుండగా కత్తిని మెడపై ఉంచి పలు భాగాల్లో బలవంతంగా అసభ్యంగా ప్రవర్తించాడని పేర్కొంది. బయపురెడ్డి వాసుదేవరెడ్డి అతనిని ప్రేరేపిస్తూ వెనుక నుంచి సహకరించాడంది. సమీపంలో పశువులు మేపుకుంటున్న పట్నం మల్లేశ్వరి, వరలక్ష్మి గమనించి కేకలు వేయడంతో శ్రీనివాసులరెడ్డి, వాసుదేవరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారని పేర్కొంది. ఈ సంఘటనలో గాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది.. పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధిత మహిళ వివరించింది. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. ఆ మేరకు చాపాడు పోలీసులు విచారిస్తున్నారు.

ప్రారంభించినా.. నిర్వహణేదీ..!

నిరుపయోగంగా రైతుబజార్ - అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ప్రజాశక్తి - వేంపల్లె

గత ప్రభుత్వ పాలనలో వేంపల్లె పంచాయతీ పరిధిలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో కోట్లాది రూపాయలతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతుబజారును నూతనంగా నిర్మించారు. ఎన్నికలకు ముందు రైతు బజారు పనులు పూర్తి కావడంతో మార్చి 11న అధికారులు, ప్రజాప్రతినిధులు రైతు బజారు కేంద్రాన్ని ప్రారభించారు. కానీ నిర్వహణ మాత్రం మరిచారు. రైతుబజారును అధికారులు వినియోగంలోకి తీసుకరాకపోవడంతో అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. రైతులు, ప్రజలు, కూరగాయల వ్యాపారుల అవసరాల కోసం పాడా నిధుల కింద గత ప్రభుత్వ పాలనలో రూ.1కోటితో షెడ్లు నిర్మించారు. ప్రజా ప్రతినిధులు రైతుబజారు కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొని రాకపోవడంతో కడప రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ప్రయివేట్ స్థలంలో పెట్టిన మార్కెట్‌లోకి రైతులు పండించిన కూరగాయలను తీసుకెళ్లి విక్రయాలు చేస్తున్నారు. ప్రయివేటు స్థలంలో పెట్టిన మార్కెట్‌లో రైతులకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతోపాటు వర్షం వస్తే తడవాల్సిన పరిస్థితి. రైతులు మార్కెట్‌కు వెళ్లాలంటే తెల్లవారుజామున 2 గంటలకే వచ్చి సరుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. విద్యుత్ సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. వర్షం కురిసినప్పుడు బురదలోనే విక్రయాలు చేయాల్సి వస్తుంది. రైతులు తెచ్చే కూరగాయలను కొనుగోలు చేసేందుకు ప్రజలు వెళ్లాలంటే చాలా దూరం ఉంది. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన రైతుబజారు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ.. నిర్వహణ చేపట్టలేదు. రైతులు వ్యాపారం చేసుకొనే విధంగా షెడ్లు నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయింది. రైతుబజారులో వృథాగా ఉన్న షెడ్లను వ్యాపార దుకాణాలకు అనుకూలంగా అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతుబజార్

ట్రిపుల్‌ఐటిలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

మహేష్ బాబుకు మొదటి అడ్మిషన్ అందజేస్తున్న డైరెక్టర్‌కు స్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ప్రవేశాల పక్రియ ప్రారంభమైంది. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి క్యాంపస్ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రిపుల్‌ఐటిలోని సెంట్రల్ లైబ్రరీలో అడ్మిషన్లుకు సంబంధించి ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులందరూ సెంట్రల్ లైబ్రరీలోకి దరఖాస్తులను పూర్తి చేశారు. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలో మొదటి అడ్మిషన్‌ను సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని మర్రిమాకులపల్లె గ్రామానికి మహేష్‌బాబుకు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అందజేశారు. రెండు, మూడవ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ మొదటిరోజు అడ్మిషన్లు పొందేందుకు 515 మందికి హజరు కావాలని సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. అయితే మొదటి రోజు 427 మంది మాత్రమే అడ్మిషన్లు పొందేందుకు హాజరయ్యారని తెలిపారు. అడ్మిషన్లు పక్రియకు విద్యార్థులతోపాటు విచ్చేసిన తల్లిదండ్రులకు సదుపాయాలు కల్పిం చామన్నారు. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఇడుపులపాయి, ఒంగోలు ట్రిపుల్‌ఐటిల్లో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 22 నుండి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అడ్మిషన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదివిన 92 శాతం విద్యార్థులకు ట్రిపుల్‌ఐటిలో సీట్లు కల్పించినట్లు చెప్పారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డిన్ అకాడమిక్, క్యాంపస్ కన్వీనర్ రత్నకుమారి, ఎఫ్ఓ కోటేశ్వరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఇమ్రాన్, అకౌంట్ డీన్ చంద్రారెడ్డి, బిన్నీ, రాఘవరెడ్డి, పిఆర్ఓ తిరుపతిరెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లింగమూర్తి, జ్ఞాన వెంకట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించడంలో దొందూదొందే

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించడంలో టిడిపి, వైసిపి దొందూదొందేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా రాష్ట్రానికి సంజీవని అన్నారు. దేశంలో 10 రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమలులో ఉందన్నారు. ఈశాన్య రాష్ట్రాలైన సిక్కిం, హిమాచల ప్రదేశ్, ఉత్తరాంచల్‌తో పాటు ఆయా రాష్ట్రాలకు హోదా ఉండడంతో కేంద్ర పన్నుల్లో రాయితీ ఉందన్నారు. ఈ రాయితీల కోసం ఆయా రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతారని చెప్పారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు భరిస్తుందన్నారు. విదేశీ ఆర్థిక సంస్థల సహకారంతో రాష్ట్రాల్లో అమలయ్యే పథకాలకు 100 శాతం నిధులు కేంద్రం భరిస్తుందని వివరించారు. వీటిని దృష్టిలో పెట్టుకొని 2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా పార్లమెంటులో ప్రకటించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి ప్రత్యేక హోదా అమలై ఉండేదన్నారు. బిజెపి మోసగారితనం, టిడిపి, వైసిపి చేత గానితనం వల్ల అమలు కాలేదని విమర్శించారు. 2014 నుండి 2019 వరకు రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నా ప్రత్యేకహోదా సాధించలేక పోయిందని తెలిపారు. 20పై చిలుకు ఎంపీలను ఇవ్వండి కేంద్రం మెడలు వంచి ఉద్యోగాల విప్లవం తీసు కొస్తానని జగన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు కోతలు కోశారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక చేతులు పైకెత్తారని తెలిపారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చిందని, ఇటీవల సిఎం చంద్రబాబు ప్రధానికి ఇచ్చిన వినతి పత్రంలో ప్రత్యేకహోదా ప్రస్తావనే లేదన్నారు. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీహార్‌కు ప్రత్యేకహోదా కావాలని ఆ రాష్ట్రానికి చెందిన జెడియు, ఆర్‌జెడి, ఎల్‌జెపి పార్టీలు, ఒడిస్సాకు కావాలని ఆ రాష్ట్రానికి చెందిన బిజెడి పార్టీ అడిగారని తెలిపారు. కాని మన రాష్ట్రానికి చెందిన టిడిపి, జనసేన పార్టీలు అడిగిన పాపాన పోలేదని విమర్శించారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లేనని తెలిపారు. ప్రత్యేకహోదా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. టిడిపి ప్రత్యేక హోదానైనా సాధించాలి, లేదా ప్రభుత్వం నుం చైనా వైదొలగాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఎన్.తులసిరెడ్డి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉంటామని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇమాంనగర్ కాలనీలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎంపిహెచ్ఈఓ బాబా ఫక్రుద్దీన్, సిహెచ్ఓ రుక్మిణి, ఆరోగ్య కార్యకర్తలు సౌభాగ్య, స్వప్న, ఆశా కార్యకర్తలు నాగేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కొత్తపల్లె గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 200లో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ రాయలసీమ కన్వీనర్ తీట్ల రవికుమార్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆ మేరకు వారు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రమిచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు ప్రయివేట్ వ్యక్తులు బ్రహ్మ పదం అంటూ సర్వేనెంబర్ 200లో దాదాపు 15 సెంట్ల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, బేస్ మట్టం నిర్మించి, చుట్టూ కంచ వేసుకొని ఉన్నారన్నారు. రెండేళ్లుగా ఈ తంతు జరుగుతున్నా స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులుగానీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ స్థలంలో గుడి నిర్మిస్తామని చెబుతున్నారని, ఇక్కడ గుడి నిర్మించి వారి వ్యాపారాలైన తాయత్తులు అమ్ముకోవడం, జాతకాలు చెప్పడం చేస్తారని అనిపిస్తోందన్నారు. సొంతంగా జాతకాలు చెప్పడానికి, ఏ ఇతర కార్యక్రమాలకైనా సొంతంగా స్థలం కొనుక్కోవాలని సూచించారు. వీరబ్రహ్మేంద్రస్వామి తనను తాను ఏనాడు దేవుడిగా చెప్పుకోలేదన్నారు. ఆయన పేరు చెప్పుకొని ఇలా చేయడం భావ్యం కాదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి నుంచి 'పొలంబడి'

చాపాడు : మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పలు సలహాలు ఇవ్వనున్నారు. మంగళవారం అల్లాడుపల్లె, లక్ష్మీపేట, 24న మడూరు, అన్నవరం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలు ఆగస్టు 28వ తేదీ వరకు నిర్వహిస్తామని, ఆయా కార్యక్రమాల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎఒ కోరారు. సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

వేంపల్లె : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హైస్కూల్ ప్లస్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చెరుకూరి శ్రీనువాసులు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ప్లస్ జూనియర్ కళాశాలలో సోమవారం పెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోదర భావంతో సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులు కలిసి ఉండాలని సూచించారు. అర్థం కాని విష యాలను అధ్యాపకులను అడగి తెలుసుకోవాలని కోరారు. అన్ని సబ్జెక్టులపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలన్నారు. చదువుపైనే ఎక్కువగా దృష్టి పెట్టాలని కోరారు. దుర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పిజిటి అధ్యాపకులు వెంకట్, రమేష్, గుర్నాథ్‌రెడ్డి, సురేష్, కృష్ణవేణి, రాధా, రెడ్డి సాయి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కెవికె ఆధ్వర్యంలో రైతులకు సూచనలు

మైదుకూరు : వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ అరటి, పసుపు రైతు ఉత్పత్తి దారుల సంఘం సహకారంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.బాలకృష్ణ పసుపు, మామిడి, అరటి, మిరపలో పోషక యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సదస్సులో ఎల్‌వి రమణారెడ్డి, డాక్టర్ టి.సుధాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, టి.బాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అమరావతి, పోలవరంతో 'సీమ'కు ఒరిగేదేమీ లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మొదటి నుంచి ముఖ్యమంత్రి రాజధాని అమరావతి, పోలవరం అనే మంత్రాలనే జపిస్తూ వస్తున్నారని, వీటివల్ల రాయలసీమ ప్రాంతానికి, కడప జిల్లాకూ ఒరిగిందేమీ లేదని స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ అందరితో కలిసి, అందర్నీ కలుపుకొని స్టీల్ ప్లాంట్ సాధించుకునే దిశలో భాగంగా విభజన బిల్లులో పేర్కొన్న ప్రధానమైన అంశాల్లో మనకు అత్యంత ప్రధానమైంది స్టీల్ ప్లాంట్, మరో ప్రధానమైన అంశం ప్రత్యేకహోదా అన్నారు. ఈ రెండు అంశాలను టిడిపి మేనిఫెస్టోలో చేర్చ లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు విషయంలో చంద్రబాబు అత్యంత కీలకమైన సందర్భంలోనూ ప్రధాన డిమాండ్లుగా ఈ రెండు అంశాలను వారి ఎదుట పెట్టలేదన్నారు. కడప ఉక్కు విషయమై గతంలో అన్ని విపక్షాలతోపాటు టిడిపి కూడా గళమెత్తిందన్నారు. ఏకంగా కడపలో నిరాహార దీక్షలు కూడా చేయించింది సీఎం రమేష్ నాయుడు, బీటెక్ రవి చురుగ్గా నిరాహార దీక్షలో పాల్గొన్నారన్నారు. సీమ ప్రజలందరూ తమ మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ సలీం, కులాయప్ప, కార్యవర్గ సభ్యులు చంద్ర, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్

విద్యార్థులకు పదో తరగతి కీలకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులకు పదో తరగతి కీలకమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని తాళ్లమాపురం జడ్పీహెచ్ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పిల్లలందరితో ఒక్కొక్కరిగా ఒక్కో సబ్జెక్టులో ప్రశ్నలు అడుగుతూ వారి పరిశీలన జ్ఞానాన్ని, స్థాయి గురించి తెలుసుకున్నారు. అడిగిన పిల్లలు అందరూ ఇచ్చిన సమాధానాలకు ఉప విద్యాశాఖాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.గోపీనాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎసి జె.వెంకటసుబ్బయ్య

వేలంలో రూ.37.70 లక్షల ఆదాయం

- దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండిక్షేత్రంలో టోల్‌గేట్, పూలదండలు అమ్ముకొనుటకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలో రూ.37.70 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎసి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టోల్‌గేట్ ద్వారా రూ.18.55 లక్షలకు మారెళ్ళ మడక గ్రామానికి చెందిన ఓబులేసు, పూలదండలు అమ్ముకొనుటకు రూ.19 లక్షల 15వేలకు కొండవాండ్లపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ దక్కించుకున్నారు. గత ఏడాది కంటే ఇప్పుడు రూ.3.65లక్షలు ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఇప్పుడు వేలం దక్కించుకున్న వారు ఏడాదిపాటు ఆయా కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కేసరిస్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజస్వామి, చక్రాయపేట ఏపీజీబీ మేనేజర్ భానుచంద్ర, వేలం పాటదారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - మైదుకూరు

మున్సిపాలిటీ పరిధిలో ముందస్తు చర్యల్లో భాగంగా సీజనల్ వ్యాధుల నివారణకు ఫాగింగ్ నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా తెలిపారు. నగరంలోని ప్రధాన రోడ్లల్లో దోమల నియంత్రణ నిమిత్తం చర్యలు చేపట్టామన్నారు. వీధుల్లోని మురుగు కాలువల్లో పూడికల తీత, నీటి నిల్వ ప్రాంతాల్లో, మురుగు గుంటల్లో స్ప్రే బాల్స్ చల్లించినట్లు తెలిపారు.

సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజంలోని ప్రతి ఒక్కరూ కుష్టువ్యాధి పట్ల అవగాహన కలిగి ఈ వ్యాధిని దూరం చేయాలని యుపిహెచ్‌సి వైద్యాధికారి హిమబిందు, డిపిఎంఓ శివశంకరయ్య తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి రోడ్డు పరిధిలోని ప్రకాష్‌నగర్, సాయికుటీర్ రోడ్డులో ఎల్సిడిసిలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పల మీద వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ వ్యాధికి ధనిక, పేద తేడా ఉండదన్నారు. కార్యక్రమంలో సిఒ సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆధార్ నమోదు, అందులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సోమవారం ఈఓపిఆర్డీ వీరభద్రుడు తెలిపారు. ఆధార్ కేంద్రాలు గ్రామాల వారీగా ఈనెల 23న ముద్దనూరు–1, 24న ముద్దనూరు–2, 25న కొర్రపాడు, 26న నల్లబల్లె, 27న తిమ్మాపురం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఐదు రోజులు ఉప్పలూరులో ఉన్న ఆధార్ కేంద్రంలో సేవలు నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో ఆధార్ నమోదు, అప్డేట్, పేరు, ఫొటో, పుట్టినరోజు, ఫోన్ నెంబర్ తదితర సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వీటికి సంబంధించిన ఆధారాలు వెంట తీసుకురావాలని ఆయన కోరారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీరభద్రుడు కోరారు.

మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం : ఈనెల 23 నుంచి నిర్వహించనున్న మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ సూచించారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఆధార్ కేంద్రాల్లో అప్పుడు పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్లలోపు ఆధార్ కార్డు అప్డేట్ చేయడం, చిరునామా, ఫొటో మార్పు, వేలిముద్రలు అప్డేట్, ఫోన్ నెంబర్లు లింక్ చేస్తారన్నారు. ఈనెల 23న కేజీవీబీ పాఠశాల నిడువెలగల అంకాలమ్మ గూడూరు జడ్పీ హైస్కూల్, 24న జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్ సింహాద్రిపురం, బలపనూరు జడ్పీ హైస్కూల్, 25న జడ్పీ హైస్కూల్ గురజాల, జడ్పీ హైస్కూల్ కోరగుంటపల్లె, 26న ప్రైమరీ స్కూల్ బిదనంచెర్ల, ప్రైమరీ స్కూల్ లోమడ, 27న జడ్పీ హైస్కూల్ హిమకుంట్ల, జడ్పీ హైస్కూల్ రావులకొలను గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రూ.30 వేలు పలికిన లడ్డూ

ముద్దనూరు : మంగపట్నంలో పెనుగొండ బాబయ్య జాతర పీర్ల సందర్భంగా సోమవారం కమిటీ సభ్యులు స్వామి వారి లడ్డూ వేలంపాట నిర్వహించారు. వేలంలో కోడిగాండ్లపల్లెకు చెందిన లక్ష్మినారాయణ రెడ్డి, నవీన్‌రెడ్డి రూ.30వేలకు లడ్డూను దక్కించుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA

E.P.No. 15/2024
O.S.No. 135/2015

Gurrampati Yerrasubbaiahgari Venkata Subba Reddy, son of Gurrampati Yerrasubbaiahgari Bala Subba Reddy, age 54 years, Hindu, Business, resident of Chennur Village and Mandal of Kadapa District. **...Petitioner/D.Hr**

Vs

Smt. V.Suvarna@Suvarnamma, wife of Yelachala Janardhan Reddy, Hindu, Housewife, aged about 35 years, Door No.4/486/2, 4th Floor, Sankara puram, Chinnachowk, Kadapa Town, Previously Residing at Door No. 41/483, Sankarapuram, Kadapa. **...Respondents/J.Dr**

NOTICE TO RESPONDENT/J.Dr

ఇందుమూలముగా J.Dr. అయిన నీకు పై E.P.No.15/2024 లో తెలియజేయడం ఏమనగా D.Hr నీ పై E.P. దాఖలా చేసియున్నారు. సదరు E.P.No.15/2024 నీ నోటీసుకు గాను 16.08.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు నీ పై పరోక్షముగా తీర్మానించబడును.

//By the Order of the Court//

S.S.D.RAMASWAMY, LL.M.,
Advocate for the D.Hr.
Kadapa City. Cell: 9849410091.